

ఓటు వినియోగించుకోవాలి

గోదావరిఖని: ఓటుహక్కును ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని స్వీప్ ఆక్టివిటీస్ జిల్లా నోడల్ అధికారి రౌఫ్ఖాన్ అన్నారు. ఆర్జీ–1 పరిధి జీడీకే–2, 2ఏగనిపై అవగాహన కల్పించారు.



జడ్జిలను కలిసిన సీపీ

గోదావరిఖని: సీపీ రెమా రాజేశ్వరి బుధవారం పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల ప్రిన్సిపల్ జడ్జిలను కలిశారు. లోక్అదాలత్‌లో 15,072 కేసులు పరిష్కరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.0 /22.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లావ్యాప్తంగా కొన్నిచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

విద్యార్థుల అభివృద్ధికే 'ఉన్నతి'



మాట్లాడుతున్న డీఈవో మాధవి

జ్యోతినగర్: విద్యార్థుల అభివృద్ధికే ఉన్నతి కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని డీఈవో మాధవి అన్నారు. ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్‌లోని జెడ్పీ హైస్కూల్‌లో సాంఘికశాస్త్రం ఉపాధ్యాయులకు ఇస్తున్న శిక్షణకార్యక్రమంలో మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. చందనాపూర్ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని హర్షిత జపాన్‌లో జరిగే సైన్స్ ఫెయిర్‌కు ఎంపికై ందని పేర్కొన్నారు. అకడమిక్ మానిటరింగ్ అధికారి షేక్, కోర్సు డైరెక్టర్ సంపత్‌రావు, రమేశ్, కేడం శ్రీనివాస్, సత్యనారాయణమూర్తి, అంజయ్య, సునీత, అంతర్గాం, రామగుండం, పాలకుర్తి, కమాన్‌పూర్, రామగిరి, మంథని, ముత్తారం మండలాల ఉపాధ్యాయులు 65 మంది పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యరక్షణకు ఆయుష్మాన్‌భవ



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

కోల్‌సిటీ: పేద, మధ్య తరగతి ప్రజలు ఆరోగ్యంగా ఉండేందుకు కేంద్రం ఆయుష్మాన్ భవ కార్యక్రమాన్ని ప్రారంభించందని సిమ్స్ (సింగరేణి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్)ప్రిన్సిపాల్ హిమబిందుసింగ్, జీజీహెచ్ మెడికల్ సూపరింటెండెంట్ దయాల్‌సింగ్ అన్నా రు. జీజీహెచ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. ఆయుష్మాన్‌భవ దేశవ్యాప్త కార్యక్రమమని, ఉచితంగా వైద్యసేవలు అందుతాయని పేర్కొన్నారు. ఆయుష్మాన్ భారత్ కార్డులను కూడా మంజూరు చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎంఓలు అప్పారావు, తిరుమలేశ పాల్గొన్నారు.

కలుషిత జలం.. వ్యాధుల భయం..!

- అడుగడుగునా పైప్‌లైన్ లీకేజీలు
- శుభ్రం చేయని ట్యాంకులు
- ప్రజలకు కలుషిత నీటి సరఫరా




రామగుండంలో పైప్‌లైన్ లీకేజీలతో వస్తున్న మురుగునీరు

- ఈ చిత్రంలో కనిపిస్తున్న వాటర్‌ట్యాంక్ రామగుండం కార్పొరేషన్ పరిధి అశోక్‌నగర్ లోనిది. ఈ ట్యాంకు 12 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగి ఉండి.. సుమారు 6,450 నల్లా కనెక్షన్లు ఉన్నాయి. ప్రతి మూడునెలలకోసారి ట్యాంక్‌ను శుభ్రం చేస్తున్నట్లు సిబ్బంది చెబుతున్నారు. అయితే ట్యాంక్‌పై మాత్రం శుభ్రం చేసిన తేదీ.. మళ్లీ ఎప్పుడు శుభ్రం చేయాలో తెలియజేయాల్సిన తేదీని మాత్రం పొందుపర్చడం లేదు. ఇలా ఈ ఒక్క వాటర్ ట్యాంకుకే కాదు.. నగరంలోని మిగితా 11 వాటర్ ట్యాంక్‌ల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. అధికారుల పర్యవేక్షణ లోపం, సిబ్బంది నిర్లక్ష్యంతో శుభ్రం చేస్తున్న తేదీలను ట్యాంక్‌ల దగ్గర రాయటం లేదు. దీంతో ట్యాంక్‌లను క్రమం తప్పకుండా శుభ్రం చేస్తున్నారా..? లేదా..? అనే అనుమానాలు నగరవాసులు వ్యక్తం చేస్తున్నారు.





- ఈ చిత్రంలో కనిపిస్తున్న లీకైన మిషన్ భగీరథ పైప్‌లైన్ ఓదెల మండలం కొలనూర్ గ్రామంలోని 11వ వార్డులో ప్రధాన రహదారి పక్కనున్నది. మురికి కాలువలో మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ కావటంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. మరమ్మతు కోసం అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని వాపోతున్నారు. ఇలాంటి లీకేజీలు జిల్లావ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో అవుతున్నాయి. అధికారులు మరమ్మతు చేపట్టకపోవడంతో నీరు రంగుమారి వస్తోంది. ఫలితంగా ప్రజలు మిషన్ భగీరథ నీరు తాగటం లేదు. చాలామంది వాటర్ ప్లాంట్లలో నీరు కొనుక్కుని తాగుతున్నారు.



నింబంధనలకు నీళ్లు..

ట్యాంకుల శుభ్రత బాధ్యత పంచాయతీలదే. సాధారణంగా గ్రామాల్లో ప్రతినెలా 1, 11, 21 తేదీల్లో ట్యాంకులను బ్లీచింగ్ పౌడర్ వేసి శుభ్ర చేయాలి. ఒకరోజు పూర్తిగా డ్రైగా ఉంచాలి. మరసటి రోజు ట్యాంకులోకి నీరు నింపి సరఫరా చేయాలని నిబంధనలు చెబుతున్నాయి. ట్యాంకులు శుభ్రం చేసిన తరువాత ట్యాంకు కింద పిల్లర్‌పై ఏరోజు శుభ్రపరిచారో రాయాలి. అలాగే తిరిగి ఎప్పుడు శుభ్రం చేస్తారో కూడా రాయాల్సి ఉంది. ట్యాంకు శుభ్రం పరిచినప్పుడు స్థానికులతో సంతకాలు తీసుకోవాలి. ఇవేవీ గ్రామాల్లో అమలు కావడం లేదు. రెగ్యులర్‌గా శుభ్రం చేయపోతే నాచుపట్టి సూక్ష్మజీవులు చేరే ప్రమాదం ఉంటుంది. క్లీనింగ్ లేని ట్యాంకుల ద్వారా సరఫరా అయ్యే నీటిని తాగితే డయేరియా, కాలేయసంబంధ సమస్యలు, జ్వరాల బారిన పడే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు.

సాక్షి, పెద్దపల్లి: తాగునీటి పథకాల నుంచి సురక్షిత నీరు సరఫరా అవుతోందా..? నీటిని శుద్ధి చేస్తున్నారా..? ఎప్పటికప్పుడు బ్లీచింగ్ కలుపుతున్నారా..? కనీసం ట్యాంకులను శుభ్రం చేస్తున్నారా..? ఈ ప్రశ్నలన్నింటికీ లేదనే సమాధానం జిల్లాలో వినిపిస్తోంది. వర్షాకాలంలో ప్రతి ఇంటికీ నల్లా ద్వారా శుద్ధమైన నీరందిస్తేనే వ్యాధులు రాకుండా జాగ్రత్త పడవచ్చు. కానీ.. జిల్లాలో మాత్రం క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. తాగునీటిని సరఫరా చేసే ట్యాంకుల వద్ద అపరిశుభ్రత తాండవిస్తోంది. పాకురు పట్టి అధ్వానంగా మారుతున్నాయి. వీటికి సంబంధించిన వాల్వ్‌లు లీకవుతున్నాయి. ట్యాంకులు, పైపులైన్ల వద్ద నీరు చేరుతుండటంతో కలుషిత జలాలు సరఫరా అవుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. సురక్షిత నీటిని సరఫరా చేయాల్సిన ట్యాంకుల్లో క్రిములు, వ్యర్థాలు చేరుతున్నాయి. అనివార్య పరిస్థితుల్లో కలుషిత నీటినే తాగాల్సి వస్తోంది. కలుషిత నీరు తాగి రోగాల బారిన పడుతున్నారు. డయేరియా కేసులు పలుచోట్ల నమోదవుతున్నా అధికారులకు పట్టడం లేదు.

నిధుల లేమి.. అధికారుల ఉదాసీనత

మిషన్ భగీరథ ట్యాంకుల నిర్వహణను అధికారులు గ్రామపంచాయతీలకు అప్పగించారు. ప్రతినెలా రెండుసార్లు ట్యాంకులను శుభ్రపరచాలనే నిబంధన అమలుకావటం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో నిధులు లేక పోవడం, మరికొన్నిచోట్ల పాలకవర్గాలు పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తుతోంది. మున్సిపాలిటీల్లో సైతం నిబంధనల మేరకు శుభ్రపరచడం లేదు. శుద్ధనీటి సరఫరా నిర్వహణ బాధ్యతను పంచాయతీలకు అప్పగించామని మిషన్ భగీరథ అధికారులు చెబుతున్నారు. డీపీవో వివరణ కోరగా ట్యాంక్‌లు శుభ్రం చేయాలని డీఎల్‌పీవోలకు ఆదేశాలు ఇచ్చామని, ఎక్కడైనా ఇబ్బందులుంటే తమ దృష్టికి తీసుకొస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

జిల్లాలో మిషన్ భగీరథ తీరు ఇలా..

మొత్తం రక్షిత పథకాలు	352
ఆవాసాలు	436
నల్లా కనెక్షన్లు	1,44,579

చెప్పినా పట్టించుకోవడం లేదు



మురికి నీటిలో ఉన్న మిషన్ భగీరథ పైప్ లీకేజీ అయ్యింది. అవి తాగునీటిలో కలుస్తున్నాయి. లీకేజీ గురించి అధికారులకు పలుమార్లు చెప్పినా పటించుకోవడం లేదు. మూడు నెలల నుంచి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. కలుషిత నీరు తాగి చాలా మంది ఆసుపత్రుల పాలయ్యారు.

– గోపు విజేందర్‌రెడ్డి, కొలనూర్

మల్లన్న సన్నిధిలో బోనాలు



పట్నాలు వేస్తున్న భక్తులు

ఓదెల: ఓదెల మల్లికార్జునస్వామికి భక్తులు బోనాలు సమర్పించారు. ముందుగా ఆలయంలో ఒగ్గుపూజారులతో పట్నాలు వేశారు. శ్రావణమాసం చివరిరోజు సందర్భంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి భక్తులు తరలివచ్చారు. కోడె మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల ఏర్పాట్లను అధికారులు పర్యవేక్షించారు.

ఎన్టీపీసీని సందర్శించిన సెక్రెటరీ



కంట్రోల్ రూమ్ పరిశీలిస్తున్న పవర్ సెక్రెటరీ పంకజ్ అగర్వాల్

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టును కేంద్ర విద్యుత్ మంత్రిత్వ ముఖ్య కార్యదర్శి పంకజ్ అగర్వాల్, జాయింట్ సెక్రటరీ పియూస్‌సింగ్, ఎన్టీపీసీ డైరెక్టర్ ఉజ్వల్‌కాంతి భట్టాచార్య సందర్శించారు. టౌన్‌షిప్‌లోని జ్యోతిభవన్‌కు చేరుకున్న వారికి ప్రాజెక్టు సీజీఎం కేదార్ రంజన్‌పాండు స్వాగతం పలికారు. సీఐఎస్ఎఫ్ సిబ్బంది గౌరవ వందనం చేశారు. అనంతరం 800 మెగావాట్ల విద్యుత్ సామర్థ్యం గల మొదటి యూనిట్ కంట్రోల్ రూంను సందర్శించారు. అధికారులు విద్యుత్ వివరాలను వివరించారు. 500 మెగావాట్ల ఏడో యూనిట్‌ను సందర్శించి, విద్యుత్ ఉత్పత్తి, ఉత్పాదకతపై చర్చించారు. ఉన్నతాధికారులతో సమావేశమై పలు సూచనలు, సలహాలు అందించారు. వారివెంట ఏజీఎం హెచ్ఆర్ బిజయ్‌కుమార్‌టిగ్గర్ అధికారులు పాల్గొన్నారు.

మెడికోల హబ్ కన్నారం!

- సిరిసిల్ల, కరీంనగర్‌లో మెడికల్ కాలేజీల ప్రారంభం
- రేపు వర్చువల్ విధానంలో ప్రారంభించనున్న సీఎం కేసీఆర్
- ఉమ్మడి జిల్లాలో ఆరుకు చేరనున్న మెడికల్ కాలేజీల సంఖ్య
- సర్కారు కాలేజీల్లో ఏటా 500 మందికి అడ్మిషన్లు
- ప్రైవేటు కలిపితే అందుబాటులో దాదాపు 950 సీట్లు



కాలేజీ	సీట్లు	పడకలు
సిరిసిల్ల	100	300
కరీంనగర్	100	500
రామగుండం	150	330
జగిత్యాల	150	330
ప్రైవేటు	450 సీట్లు	

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: వైద్యరంగం అభ్యున్నతిలో భాగంగా మెడికల్ కాలేజీల స్థాపనకు శ్రీకారం చుట్టిన రాష్ట్ర ప్రభుత్వం మరో ముందడుగు వేయనుంది. రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల అనుమతులు సాధించిన తొమ్మిది మెడికల్ కాలేజీలను ఒకేసారి శుక్రవారం సీఎం కేసీఆర్ ప్రారంభించనున్నారు. ఇందులో ఉమ్మడి జిల్లాకు చెందిన సిరిసిల్ల, కరీంనగర్ వైద్యకళాశాలలు ప్రారంభానికి సిద్ధమయ్యాయి. ఇటీవల కాలేజీల నిర్మాణానికి ప్రభుత్వం టెండర్లు పిలవడం తెలిసిందే. అదే సమయంలో ఈ కాలేజీల్లో అడ్మిషన్ల ప్రక్రియ కూడా ఊపందుకుంది. ఈ కాలేజీల రాకతో ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల సంఖ్య నాలుగుకు చేరుకోగా, ప్రైవేటుతో కలుపుకుంటే వీటి సంఖ్య ఆరుకు చేరుకోవడం గమనార్హం. మొత్తం కాలేజీల్లో అన్నింటిలో కలిపి 950 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

ఒక్క కరీంనగర్‌లోనే 550 సీట్లు

2000 సంవత్సరం కరీంనగర్‌లో ఒక్క వైద్యకళాశాల కూడా లేదు. 2003 తర్వాత రెండు ప్రైవేటు కాలేజీలు మాత్రం వచ్చాయి. రెండేళ్ల క్రితం జగిత్యాల, రామగుండం కాలేజీలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో ప్రస్తుతం రెండు కాలేజీల్లో రెండో సంవత్సరం తరగతులు కూడా విజయవంతంగా నడుస్తున్నాయి. ఈ రెండు కాలేజీల భవనాల నిర్మాణం కూడా అదేస్థాయిలో ఉంది. ఇక రామగుండం మెడికల్ కాలేజీకి కావాల్సిన నిధులు రూ.510 కోట్లు, ఇతర మౌలిక సదుపాయాల ఖర్చును భరించేందుకు సింగరేణి ముందుకువచ్చింది. దీంతో ఆ కాలేజీ పేరును సింగరేణి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ అండ్ సైన్సెస్ (సిమ్స్)గా మార్చారు. మొత్తం 150 సీట్లలో 24 సీట్లు ఆలిండియా రిజర్వేషన్ ప్రకారం కేటాయిస్తారు. మిగిలిన 126 సీట్లలో 5శాతం సీట్లు సింగరేణి కార్మికుల పిల్లలకు రిజర్వేషన్ కింద అందజేస్తారు. 7 సీట్లు రాష్ట్రంలోని సింగరేణి ఉద్యోగుల పిల్లలకు ప్రత్యేక రిజర్వేషన్ పద్ధతిన కేటాయించనున్నారు. దీంతోపాటు జగిత్యాల మెడికల్ కాలేజీలో 150 సీట్లు అందుబాటులోకి వచ్చాయి. కాలేజీ నిర్మాణానికి ప్రభుత్వం రూ.510 కోట్లు కేటాయించింది. 27.5 ఎకరాల సువిశాల ప్రాంగణంలో కాలేజీ నిర్మాణం జరుగుతోంది. ప్రస్తుతం తాత్కాలిక భవనాల్లో తరగతులు నడుస్తున్నాయి.

ఇటీవలే టెండర్లు

ఇక ఈ ఏడాదే అనుమతి వచ్చిన కరీంనగర్, సిరిసిల్ల కాలేజీల భవనాల నిర్మాణానికి ఇటీవల ప్రభుత్వం టెండర్లు పిలిచింది. ఇందులో కరీంనగర్ రూ.104.5 కోట్లు, రూ.107.3 కోట్లు అంచనా వ్యయంగా పేర్కొంది. 15 నెలల్లో ఈ భవనాలను నిర్మించాలని టెండరు నోటీసులో పేర్కొంది. ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ కాలేజీల పరంగా చూసుకుంటే మొత్తం 600 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వీటికి ప్రైవేటు కాలేజీలైన చలిమెడ 250 సీట్లు, ప్రతిమ 200 సీట్లు కూడా కలుపుకుంటే మొత్తం 950 సీట్లు అందుబాటులోకి వచ్చాయి. ఒక్క కరీంనగర్‌లోనే 550 మెడికల్ సీట్లు వైద్యవిద్యార్థులకు అందుబాటులో ఉండటం విశేషం.

1460 పడకలు అందుబాటులోకి..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సర్కారు మెడికల్ కాలేజీ వల్ల సామాన్యులకు వైద్యం అందుబాటులోకి రానుంది. కరీంనగర్ 500, రామగుండం 330, సిరిసిల్ల 300, జగిత్యాల 330 పడకలు ఆయా కళాశాలల్లో అందుబాటులోకి వచ్చాయి. కరోనా లాంటి విపత్తులు సంభవించినపుడు ప్రజలకు అన్ని రకాల వైద్యసదుపాయాలు అందుబాటులో ఉంటాయని వైద్యనిపుణులు భరోసా ఇస్తున్నారు.


సీఎంకు కృతజ్ఞతలు



పేదలకు సేవలు అందించాలన్న కృతనిశ్చయంతో అన్ని జిల్లాలో సీఎం కేసీఆర్ ఏర్పాటు చేస్తోన్న వైద్యకళాశాలలు రాష్ట్ర ప్రతిష్టను పెంచుతాయి. ఇందుకు ముఖ్యమంత్రి కేసీఆర్, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావుకు కృతజ్ఞతలు. ఇప్పటికే మెడికల్ హబ్‌గా ఉన్న రాష్ట్రం ముున్ముందు రోజుల్లో మెడికోలకూ హబ్‌గా మారనుంది.

– డా.బీఎస్ రావు, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు

దేశానికి అన్నం, వైద్యం



ధాన్యం ఉత్పత్తిలో దేశంలోనే నంబర్‌వన్‌గా ఎదిగి, అన్నం పెడతాం. సీఎం చేపట్టిన సాగునీటి ప్రాజెక్టుల వల్ల ఇది సాధ్యమైంది. అదే ముందుచూపుతో రాష్ట్రంలో పేదలకు, సామాన్యులకు వైద్య సేవలు అందాలన్న సంకల్పంతో ప్రతీ జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ అన్న సాహసోపేతమైన నిర్ణయం తీసుకుని అమలు చేస్తున్నారు.

– గంగుల కమలాకర్, బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి

స్వచ్ఛత, పరిశుభ్రత నిరంతర ప్రక్రియ



కటికెనపల్లి సర్పంచుకు అవార్డు అందిస్తున్న కలెక్టర్



ఉత్తమ గ్రామ సర్పంచులతో ఎస్‌బీఎం కో–ఆర్డినేటర్

- పథకాల అమలులో జిల్లా అగ్రగామి
- స్వచ్ఛసర్వేక్షణ్ గ్రామాలకు అవార్డులు

పెద్దపల్లిరూరల్/ధర్మారం: గ్రామాల్లో స్వచ్ఛత, పరిసరాల పరిశుభ్రతలో జిల్లా అగ్రగామిగా నిలిచిందని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. స్వచ్ఛసర్వేక్షణ్‌లో ఎంపికై న ఉత్తమ పంచాయతీలకు బుధవారం కలెక్టరేట్‌లో పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డితో కలిసి ప్రదానం చేశారు. జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయడం ద్వారా జిల్లాకు జాతీయస్థాయిలో గుర్తింపు దక్కిందన్నారు. జిల్లాకు ఇప్పటివరకు జాతీయ స్థాయిలో 5 అవార్డులు దక్కాయన్నారు. సీఎం కేసీఆర్ సారథ్యంలో అమలవుతున్న పథకాలతోనే జిల్లాకు గుర్తింపు దక్కిందని ఎమ్మెల్యే అన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అరుణశ్రీ, పాలకుర్తి జెడ్పీటీసీ కందుల సంధ్యారాణి, జెడ్పీ సీఈఓ శ్రీనివాస్, డీఆర్‌డీఓ శ్రీధర్, డీపీఓ చంద్రమౌళి, ఎంపీపీలు, ఎంపీడీవోలు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఉత్తమ గ్రామాలుగా ఎంపికైన పంచాయతీలు

రెండు వేల లోపు జనాభా ఉన్నవాటిలో శ్రీరాంపూర్ మండలంలోని లక్ష్మీపూర్, సుల్తానాబాద్ మండలంలోని కొత్తపల్లి, సాంబయ్యపల్లి ఎలిగేడు మండలంలోని లాలపల్లి, మంథని మండలంలోని నాగారం ఉన్నాయి. రెండు నుంచి ఐదు వేల లోపు జనాభా ఉన్న గ్రామాల్లో పెద్దపల్లి మండలంలోని కాసులపల్లి, సుల్తానాబాద్‌లోని సుద్దాల, జూలపల్లిలోని కుమ్మరికుంట, ధర్మారంలోని పత్తిపాక, ఎలిగేడులోని సుల్తాన్‌పూర్, ఐదు వేలకు పైగా జనాభా ఉన్న గ్రామాల్లో ధర్మారంలోని కటికనపల్లి, ఎలిగేడు, సుల్తానాబాద్‌లోని గర్రెపల్లి, శ్రీరాంపూర్, గంగారం ఉన్నాయి.

ఉత్తమ సర్పంచులకు అవార్డులు

ఉత్తమ గ్రామపంచాయతీలుగా ఎంపికైన ధర్మారంలోని కటికెనపల్లి, పత్తిపాక, న్యూకొత్తపల్లి సర్పంచులు కారుపాకల రాజయ్య, బద్దం సుజాత, ధార మల్లమ్మకు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అవార్డులు అందించారు.జూలపల్లి మండలం కుమ్మరికుంట సర్పంచ్ మేచినేని సంతోష్‌రావు, పంచాయతీ కార్యదర్శి ఆంజనీధర్‌కు అవార్డు అందించారు.

'టెట్'కు 11 కేంద్రాలు

- హాజరుకానున్న 4909 మంది అభ్యర్థులు
- డీఈఓ మాధవి వెల్లడి



పెద్దపల్లిరూరల్: ఈనెల 15న నిర్వహించే టెట్ (టీచర్ ఎలిజిబుల్ టెస్ట్)కు జిల్లావ్యాప్తంగా 4,909 మంది అభ్యర్థులు హాజరవుతున్నారని, ఇందుకు పెద్దపల్లిలో 11 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని డీఈవో మాధవి తెలిపారు. ఉదయం 8.30 నుంచి 9.30 గంటల వరకు, మధ్యాహ్నం 1.30 నుంచి 2.30గంటల వరకు పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారని. ఆ తర్వాత అనుమతించబోరని వివరించారు. అభ్యర్థులు ఎలక్ట్రానిక్ పరికరాలు, కాలిక్యులేటర్, సెల్‌ఫోన్ తీసుకురావొద్దని సూచించారు.

హామీలు నెరవేర్చే సత్తా కాంగ్రెస్‌కే ఉంది

- పెద్దపల్లి పార్లమెంటరీ అబ్జర్వర్ మనోహర్‌జోషి



మాట్లాడుతున్న జోషి, నాయకులు

గోదావరిఖని: ఇచ్చిన హామీలు అమలు చేసే ఘనత కాంగ్రెస్ పార్టీకే సాధ్యమని ఆ పార్టీ పెద్దపల్లి పార్లమెంట్ అబ్జర్వర్ మనోహర్ జోషి, డీసీసీ అధ్యక్షుడు ఎంఎస్.రాజ్‌ఠాకూర్ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. సీడబ్ల్యూసీ సమావేశాలు హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నామని, విజయభేరి సభకు ప్రజలు అధిక సంఖ్యలో రావాలని కోరారు. సామాన్యులకు అభివృద్ధి ఫలాలు అందాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాలన్నారు. నాయకులు గంట సత్యనారాయణరెడ్డి, సంజీవరెడ్డి, మహంకాళి స్వామి, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి ఇండియా కూటమి భయం

సుల్తానాబాద్: బీజేపీకి ఇండియా కూటమి భయం పట్టుకుందని మనోహర్ జోషి అన్నారు. సుల్తానాబాద్‌లో టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావుతో కలిసి మాట్లాడారు. వారి వెంట పెద్దపల్లి అసెంబ్లీ కో–ఆర్డినేటర్ రొయ్యపల్లి మల్లేశ్, మాజీ సర్పంచ్ అంతటి అన్నయ్యగౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దన్నాయక దామోదర్‌రావు, పార్టీ మండలాల అధ్యక్షులు వేగోళం అబ్బయ్య, చిలుక సతీశ్, సుల్తానాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ బిరుదు సమత తదితరులు పాల్గొన్నారు.

జయభేరీ సభను విజయవంతం చేయండి

మంథని: ఈనెల 17న హైదరాబాద్‌లో నిర్వహించే సీడబ్ల్యూసీ విజయభేరీ సమావేశాలను విజయవంతం చేయాలని పీసీసీ అధికార ప్రతినిధి, మంథని నియోజకవర్గ కో–ఆర్డినేటర్ సుధాకర్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతియాదవ్ కోరారు. బుధవారం మంథనిలో మాట్లాడారు.

క్లుప్తంగా

ఐటీఐలో ప్రవేశాలకు ఈనెల 14 గడువు

పెద్దపల్లిరూరల్: ఐటీఐలలో మూడో విడత ప్రవేశాలకు ఈనెల 14 గడువు పొడిగించినట్లు స్థానిక ఐటీఐ ప్రిన్సిపాల్ ఏ.నరసింహాచారి తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో మూడు విడతలో సీట్లు పొందిన విద్యార్థులు జాయినింగ్ రిపోర్ట్ సమర్పించేందుకు గడువు పొడిగించామని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టీబీజీకేఎస్‌లో చేరికలు

గోదావరిఖని: ఆర్జీ–1 సివిల్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన పలువురు కార్మికులు బుధవారం టీబీజీకేఎస్‌లో చేరారు. వీరికి ఉపాధ్యక్షుడు గండ్ర దామోదర్‌రావు కండువాలు కప్పి ఆహ్వానించారు. నాయకులు కనకం శ్యాంసన్, వెంకటేష్, వడ్డేపల్లి శంకర్ పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చని రాష్ట్రప్రభుత్వం


మాట్లాడుతున్న గుజ్జుల రామకృష్ణారెడ్డి

సుల్తానాబాద్: హామీలు నెరవేర్చని బీఆర్‌ఎస్ పాలనకు చరమగీతం పాడాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుజ్జుల రామకృష్ణారెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని గాంధీనగర్‌లో సెక్టర్ సమావేశంలో మాట్లాడారు. అవినీతి, అక్రమాల పాలనకు ఎన్నికల్లో తిప్పికొట్టాలన్నారు. అనంతరం సెక్టార్ ఇన్‌చార్జి కామని రాజేంద్రప్రసాద్ గుజ్జులను సన్మానించారు. పార్టీ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు మీసఅర్జున్ రావు, పిన్నింటి రాజు, జిల్లా రైతు మోర్చా అధ్యక్షుడు గడ్డం మహిపాల్ రెడ్డి, నాగేశ్వర్, రాజన్న, మహేందర్ పాల్గొన్నారు.

శక్తి కేంద్రాలను బలోపేతం చేయాలి

గ్రామాల్లో శక్తి కేంద్రాలను బలోపేతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పర్వతాలుయాదవ్, నియోజకవర్గ ఇన్‌చార్జి సంతోష్ అన్నారు. పార్టీ పట్టణ, మండల కార్యవర్గాలకు నియామకం ఉత్తర్వులు అందించారు.

కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించండి


ప్రచారం చేస్తున్న విజయరమణారావు

సుల్తానాబాద్: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించాలని మాజీ ఎమ్మెల్యే, పీసీసీ ఉపాధ్యక్షుడు చింతకుంట విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్‌లోని ఆరో వార్డులో బుధవారం రాత్రి హాథ్‌సేహాథ్ జోడో కార్యక్రమంలో ఇంటింటా ప్రచారంచేశారు. పార్టీ అధికారంలోకి రాగానే పేదల ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు, దళితులకు ఇంటిస్థలం, నిర్మాణానికి రూ.6 లక్షలు అందిస్తామని తెలిపారు. మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం, రైతులకు ఏకకాలంలో రూ.రెండు లక్షల రుణమాఫీ చేస్తామన్నారు.

అప్పుల బాధతో బట్టల వ్యాపారి ఆత్మహత్య

కమాన్‌పూర్: మండలంలోని జూలపల్లికి చెందిన బట్టల వ్యాపారి బొమ్మిడి రవి (55) అప్పుల బాధతో తన ఇంటి ఆవరణలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. రవి కొన్నేళ్లుగా మండలకేంద్రంలో బట్టల షాపు నిర్వహిస్తున్నాడు. వ్యాపారం నిమిత్తం రూ.40లక్షల అప్పు చేశాడు. మరోవైపు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కొద్దిరోజులుగా ఇంట్లోనే ఉంటున్నాడు. అప్పులు ఎలా తీర్చాలోనని నిత్యం మదనపడుతున్నాడు. రవి భార్య అన్నపూర్ణ, కుమారుడు అభినయ్ బుధవారం బయటకు వెళ్లారు. కుమార్తె సౌమ్య ఇంట్లోనే ఉంది. రవి ఇంటి బయటికి వెళ్లి చేదబావి దూలానికి చున్నీతో ఉరేసుకున్నాడు. కుమారుడు అభినయ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బేతి రాములు తెలిపారు.

ఆయుష్మాన్‌భవ ఆరంభం


వర్చువల్ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

పెద్దపల్లిరూరల్: ప్రజలందరికీ మెరుగైన ఆరోగ్య సేవలను అందించేందుకు వీలుగా ఆయుష్మాన్ భవ కార్యక్రమాన్ని బుధవారం రాష్ట్రపతి ద్రౌపదిముర్ము వర్చువల్ పద్ధతిన ప్రారంభించారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆసుపత్రిలో ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, డీఎంహెచ్‌వో ప్రమోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఆయుష్మాన్ భవ కార్యక్రమాన్ని అన్ని ప్రాంతాల్లో నివసించే ప్రజలకు అందించడమే ముఖ్య ఉద్దేశమని డీఎంహెచ్‌ఓ పేర్కొన్నారు. ప్రతి శనివారం ఆరోగ్య మేళాలు నిర్వహించి అవసరమైన పరీక్షలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈనెల 17 నుంచి అక్టోబర్ రెండు వరకు ఆయుష్మాన్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించి పూర్తిచేసిన గ్రామాలు, వార్డులకు సర్టిఫికెట్లను ప్రదానం చేస్తారని పేర్కొన్నారు. డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రమాకాంత్, శౌరయ్య, రాజమౌళి, సుధాకర్ రెడ్డి, మధుకర్ రెడ్డి ఉన్నారు

లక్ష్యం ఘనం.. చర్యలు శూన్యం

- జిల్లాకు 10 యోగా కేంద్రాలు
- నత్తనడకన పనులు
- గ్రామీణులకు ఇబ్బంది


గర్రెపల్లిలో నిరుపయోగంగా యోగా కేంద్రం

సుల్తానాబాద్: మారుతున్న ఆహారపు అలవాట్లు.. సమయపాలన లేకుండా విధులు నిర్వర్తించడం తదితర కారణాలతో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. ఇలాంటి వారికి కాస్త ఉపశమనం కోసం కేంద్రప్రభుత్వం నేషనల్ ఆయూష్ మిషన్‌లో భాగంగా గ్రామాల్లో హెల్త్ వెల్‌నెస్ సెంటర్ పేరిట యోగా కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంది. ఆ మేరకు నిధులు కూడా మంజూరు చేసింది. గ్రామీణులతో యోగాసనాలు వేయించడంతోపాటు మంచి ఆహారపు అలవాట్లు అవలంబించడం ద్వారా అనారోగ్య సమస్యల నుంచి బయటపడే అవకాశం ఉంటుందని భావించి కేంద్రాలు ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. యోగా కేంద్రాల్లో యోగాసనాలు వేయించేలా ఆసక్తిగల ఆశా కార్యకర్తలకు శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది. ఆసక్తి ఉన్న ఆశాకార్యకర్తల పేర్లను ఇప్పటికే ఉన్నతాధికారులకు పంపించారు.

అసంపూర్తిగా పనులు

కేంద్రప్రభుత్వం ప్రకటించిన దాని ప్రకారం జిల్లా వ్యాప్తంగా 40కిపైగా యోగా కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే కేవలం 10 కేంద్రాలు మాత్రమే మంజూరయ్యాయి. సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి, ముత్తారం మండలం అడవిశ్రీరాంపూర్, మంథని మండలం ఆరెంద, ధర్మారం, పెద్దపల్లి మండలం అప్పన్నపేట, జూలపల్లి, రామగుండం, రామగిరి మండలం పెద్దంపేట, ఓదెల మండలం పొత్కపల్లి, కాల్వశ్రీరాంపూర్ మండలం పెగడపల్లి గ్రామాలను ఎంపిక చేశారు. వీటికి టెండర్లు పిలిచి పనులు కూడా ప్రారంభించారు. ఒక్కో కేంద్రానికి రూ.ఆరు లక్షల చొప్పున కేటాయించారు. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్లు పనులను నెమ్మదిగా చేస్తుండడంతో ఉద్యోగులు, సిబ్బందికి ఇబ్బందిగా మారింది. పనులు వేగవంతం చేసి పూర్తి చేయాల్సిన బాధ్యత కాంట్రాక్టర్లపై ఉందని పలువురు అంటున్నారు. యోగా కేంద్రాల పనులు వేగవంతంగా చేసి సిబ్బందికి ప్రజలకు అందుబాటులో ఉండేలా చేయాలని జిల్లా వైద్యాధికారి కాంట్రాక్టులను ఆదేశించారు.

త్వరలోనే పూర్తి



జిల్లాకు పది కేంద్రాలు మంజూరయ్యాయి. అవన్నీ చివరిదశలో ఉన్నాయి. అసంపూర్తిగా ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేస్తాం. గ్రామీణ ప్రజలకు యోగాకేంద్రాలతో ఎంతో ఉపయోగం ఉంది. ఆ దిశగా పనులు చేపడుతున్నాం.

– ప్రమోద్ కుమార్, డీఎంహెచ్‌వో

అందుబాటులోకి తేవాలి



ప్రజల ఆరోగ్యం కోసం యోగా కేంద్రాలను మంజూరు చేసింది. పనులు చేసి ప్రజలకు అందుబాటులో తీసుకురావాల్సిన అవసరం ఉంది. గ్రామప్రజలు రోగాల బారిన పడుతున్నారు. యోగాతో రోగాలు దూరమవుతాయి.

– వీరగోని సుజాత, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షురాలు

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న శ్యాంప్రసాద్ లాల్

కమాన్‌పూర్: మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని అదనపు కలెక్టర్ జీవీ.శ్యాంప్రసాద్ లాల్ బుధవారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి భూ సమస్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు. భూసమస్యల దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. తహసీల్దార్ మోహన్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ రాజేశ్వర్‌రావు, జూనియర్ అసిస్టెంట్ మల్కారెడ్డి ఉన్నారు.

రామగిరి: ధరణి సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దని అదనపుకలెక్టర్ సూచించారు. రామగిరి తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. జీవో నంబర్ 59, 76పై తహసీల్దార్‌తో చర్చించారు. అర్హులందరికీ ఓటుహక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

రైతుల కోసమే సహకార బ్యాంకులు

- కేడీసీసీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు


ముత్తారంలో బ్యాంకును ప్రారంభిస్తున్న కొండూరి రవీందర్‌రావు, జెడ్పీ చైర్మన్ మధు

ముత్తారం: చిన్న, సన్నకారు రైతుల సంక్షేమం కోసమే కేంద్ర సహకార బ్యాంకులు పనిచేస్తున్నాయని జాతీయ సహకార సంఘం అధ్యక్షుడు కొండూరి రవీందర్‌రావు అన్నారు. మండల కేంద్రంలో కేడీసీసీ బ్యాంకు శాఖను జెడ్పీ చైర్మన్ పుట్ట మధుతో కలిసి బుధవారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడ్డాక బ్యాంకు రూ.6వేల కోట్ల లావాదేవీలతో కొనసాగుతోందన్నారు. మంథని వంటి మారుమూల ప్రాంతాలకు కమర్షియల్ బ్యాంకులకు దీటుగా కేడీసీసీ బ్యాంకు ద్వారా సేవలందిస్తామన్నారు. బ్యాంకు శాఖను రూ.100 కోట్ల వ్యాపారంలోకి తీసుకురావాలన్నారు. ఆర్నెళ్లలో బ్యాంకుకు పక్కా భవనం నిర్మిస్తామన్నారు. కేడీసీసీ బ్యాంకుల అనుసంధానంగా వ్యవసాయ సహకార సొసైటీల్లో కామన్‌సర్వీస్ పాయింట్, మైక్రో ఏటీఎం ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. పోడు, లావోణి పట్టా భూములున్న రైతులకు రుణాలు ఇవ్వడానికి ఉన్నతాధికారులు, పాలకవర్గసభ్యులతో చర్చిస్తామన్నారు. కార్పొరేట్, కమర్షియల్ బ్యాంకులకు దీటుగా కేడీసీసీ బ్యాంకు రుణాలు ఇస్తోందని జెడ్పీ చైర్మన్ మధు అన్నారు. కేడీసీసీబీ వైస్ చైర్మన్ పింగళి రమేశ్, మాజీ ఎమ్మెల్యే, జిల్లా డైరెక్టర్ వుచ్చిడి మోహన్‌రెడ్డి, సంఘం సీఈవో సత్యనారాయణ, నాబార్డు డీడీఎం జయప్రకాశ్, ఎంపీపీ జక్కుల ముత్తయ్య, వైస్ ఎంపీపీ రవీందర్‌రావు, ముత్తారం, మంథని సింగిల్ విండో చైర్మన్లు జి.రాజిరెడ్డి, కొత్త శ్రీనివాస్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అదరహో.. చిల్డ్రన్స్ సైన్స్


ప్రశంసాపత్రాలు అందుకుంటున్న విద్యార్థులు

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని కేంద్రీయ విద్యాలయం ఆవరణలో రెండు రోజులపాటు జరిగిన 31వ నేషనల్ చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్ క్లస్టర్ లెవల్ ప్రదర్శన ముగిసింది. బొల్లారం క్లస్టర్ సైన్స్ ప్రదర్శనలో తొమ్మిది కేంద్రీయ విద్యాలయాల విద్యార్థులు తయారు చేసిన ప్రదర్శనలను ప్రదర్శించారు. న్యాయ నిర్ణేతలు ప్రదర్శనలు తిలకించి జూనియర్, సీనియర్ విభాగాలుగా ఎంపిక చేశారు. ఐదు అంశాలలో నిర్వహించిన పోటీలలో జూనియర్ విభాగంలో శ్రేయ గణేష్ కాలె(తిరుమలగిరి), చక్రీత్, వైష్ణవి కుమారి(బొల్లారం), సంప్రద రాధాకృష్ణన్(తిరుమలగిరి), సుప్రతిక్ కుమార్(సిరిసిల్ల), సీనియర్ విభాగంలో ఆర్పిత్ కుమార్ మిశ్రా(హకీంపేట), ఆయేషా ఫాతిమా, మయాంక్ సింగ్(బొల్లారం), అక్షిత్ పాడ్య (ఎన్టీపీసీ, రామగుండం), కోమల్ పటేల్ (బొల్లారం)కు ప్రశంసాపత్రాలను అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రసాద్‌తో పాటు ఇన్‌చార్జి ప్రిన్సిపల్ సూర్యకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

జీడీకే-11గనిలో కార్మికుడికి అస్వస్థత


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్మికుడు

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–1 పరిధి జీడీకే–11గనిలో బుధవారం బదిలీ వర్కర్ కార్మికుడు రాజశేఖర్‌రెడ్డి అస్వస్థతకు గురయ్యాడు. గనిలోని ఫస్ట్ ఎల్‌హెచ్‌డీ సెక్షన్‌లో పనిచేస్తుండగా వెంటిలేషన్ సరిగా లేక పడిపోయాడని, అతడిని సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించారని హెచ్‌ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్‌అహ్మద్ తెలిపారు. పనిస్థలాల్లో గాలి సరిగా లేదని చెప్పినా సేఫ్టీ ఆఫీసర్ పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితి వచ్చిందన్నారు.

కాళోజీ పురస్కారానికి పృథ్వీరాజ్


భీమనపల్లి పృథ్వీరాజ్

పాలకుర్తి: మండలంలోని కన్నాలశాలపల్లికి చెందిన భీమనపల్లి పృథ్వీరాజ్ జాతీయ కాళోజీ పురస్కారానికి ఎంపికయ్యారు. సదాశయ ఫౌండేషన్ మండల అధ్యక్షుడిగా కొనసాగుతున్న పృథ్వీరాజ్ ఇప్పటివరకు 45కుపైగా అవయవ, నేత్రదానాలకు కృషి చేశారు. ఆయన సేవలు గుర్తించిన హైదరాబాద్‌కు చెందిన జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ తెలుగు వెలుగు సాహితీ వేదిక వారు పురస్కారానికి ఎంపిక చేశారు. ఈనెల 17న హైదరాబాద్‌లోని త్యాగరాయగానసభలో పురస్కారం అందించనున్నట్లు సంస్థ వ్యవస్థాపక చైర్మన్ పాలోజు రాజ్‌కుమార్ తెలిపారు.

15న ఎస్టీ సబ్సిడీ రుణాలకు ఇంటర్వ్యూలు

కోల్‌సిటీ(రామగుండం): కార్పొరేషన్ కార్యాలయంలో ఎస్టీ సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఈనెల 15న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు కమిషనర్ సీహెచ్.నాగేశ్వర్ తెలిపారు. కార్పొరేషన్‌కు ఎస్టీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాల యూనిట్లు 24 కేటాయించారు. వీటికి 105 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. వారికి 15న ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూలు ఉంటాయని, ఆధార్‌కార్డు, కులం, నివాసం, ఆదాయం ధ్రువీకరణపత్రాలు, ఆహార భద్రత కార్డులతో సకాలంలో హాజరుకావాలని ఆయన సూచించారు.

బెల్టుషాపు నిర్వాహకుల బైండోవర్

జూలపల్లి: అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో అనుమతి లేకుండా బెల్ట్‌షాపులను నిర్వహిస్తున్న వారిని ఎక్సైజ్ ఎస్సై ప్రభాకర్ తహసీల్దారు బషీరోద్దీన్ ముందు బుధవారం బైండోవర్ చేశారు. కాచాపూర్, వడ్కాపూర్, జూలపల్లి, అబ్బాపూర్ గ్రామాల్లోని బెల్ట్ షాపుల నిర్వాహకులు నలుగురిని బైండోవర్ చేశారు.

బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలు

పాలకుర్తి: మండలంలోని లక్ష్మీపురం మూలమలుపు వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం.. జీడీనగర్‌కు చెందిన ఒల్లెపు రమేశ్ పాలకుర్తి నుంచి జీడీనగర్‌కు బైక్‌పై వెళ్తున్నాడు. అదే సమయంలో లక్ష్మీపురానికి చెందిన పెద్దపల్లి సాయిప్రేమ్ బసంత్‌నగర్ నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. మార్గమధ్యంలో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో రమేశ్, సాయిప్రేమ్‌లు తీవ్రంగా గాయపడ్డారు. వారిని 108లో పెద్దపల్లికి.. అక్కడి నుంచి కరీంనగర్‌కు తరలించినట్లు తెలిసింది.

ఏఐటీయూసీలో చేరిన మహిళా కార్మికులు

- కండువాలు కప్పి ఆహ్వానించిన నాయకులు

గోదావరిఖని: సింగరేణి ఆర్జీ రామగుండం డివిజన్–1 ఏరియాలో సివిల్ విభాగంలో పనిచేస్తున్న మహిళా కార్మికులు ఏఐటీయూసీలో చేరారు. భాస్కర్‌రావుభవన్‌లో జరిగిన కార్యక్రమంలో పర్మినెంట్ మహిళా కార్మికులు ప్రేమలత, సరిత, సుమలత బుధవారం యూనియన్‌లో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. నాయకులు ఆరెల్లి పోశం, మాదన మహేశ్, మిట్ట శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

రక్షణతో బొగ్గు ఉత్పత్తి చేయాలి


నివాళులర్పిస్తున్న అధికారులు

గోదావరిఖని: రక్షణ చర్యలు తీసుకుంటూ బొగ్గు ఉత్పత్తి చేయాలని సింగరేణి డైరెక్టర్ ఎన్‌వీకే.శ్రీనివాస్ సూచించారు. బుధవారం యైటింక్లయిన్ ఎన్‌సీఓఏ క్లబ్‌లో జరిగిన ఆర్జీ–2 ఏరియా స్థాయి 19వ రక్షణ త్రైపాక్షిక సమావేశంలో మాట్లాడారు. సేఫ్టీ ఆపరేటింగ్ విధానంతో ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డిప్యూటీ డైరెక్టర్ మైన్స్ సేఫ్టీ భూషణ్‌ప్రసాద్‌సింగ్ మాట్లాడుతూ రక్షణసూత్రాలను ప్రతిఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ప్రమాదరహిత ఏరియాగా తీర్చిదిద్దేందుకు కృషిచేయాలన్నారు. సమావేశంలో డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ నాగేశ్వర్‌రావు, బెహెర, అరుముగం, డీడీఎంఎస్ బానోత్ వెంకన్న, రాజీవ్ ఓంప్రకాశ్, జార్జ్ జాన్, కార్పొరేట్ జీఎం సుభాని, ఆర్జీ–2 జీఎం ఎల్‌వీ.సూర్యనారాయణ, రీజియన్ సేఫ్టీ జీఎం సాంబయ్య, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

మీడియాకు లేని సమాచారం

రక్షణపై చర్చించే సమావేశానికి యాజమాన్యం మీడియాను ఆహ్వానించలేదు. సేఫ్టీ త్రైపార్టైడ్ సమావేశాన్ని గుట్టుగా నిర్వహించడంపై కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరిగినప్పుడే హడావుడి చేసే అధికారులు ఆ తర్వాత నిర్వహించే కీలక సమావేశాలకు మీడియాను ఆహ్వానించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సమావేశం పూర్తయిన తర్వాత ప్రకటన విడుదల చేయడం ఏకపక్షమని పేర్కొన్నారు.

ఉపాధి కల్పించేలా ఎదగాలి

- డీజీఎం పర్సనల్ అధికారి అనిల్ కుమార్


పరీక్షలను పర్యవేక్షిస్తున్న డీజీఎం

యైటింక్లయిన్‌కాలనీ: వృత్తి విద్య కోర్సుల్లో శిక్షణ తీసుకున్నవారు మరింత మందికి ఉపాధి చూపేలా యూనిట్లు ఏర్పాటు చేసుకోవాలని ఆర్జీ–2 ఏరియా అఫీషియేటింగ్ డీజీఎం పర్సనల్ అండ్ అధికార ప్రతినిధి ఎస్.అనిల్‌కుమార్ అన్నారు. ఆర్జీ–2 ఏరియా సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో మహిళలకు బుధవారం యైటింక్లయిన్‌కాలనీ సెక్టర్–3 పాఠశాలలో నిర్వహించిన రాత పరీక్షలను ఆయన పర్యవేక్షించారు. 180 మంది మహిళలు పరీక్షకు హాజరయ్యారు. డీవైజీఎం వేణుగోపాల్, వంశీధర్, కో–ఆర్డినేటర్ ఆఫీసర్ అండ్ సీనియర్ పర్సనల్ అధికారి శ్రీనివాస్, సింగరేణి సేవా సమితి కో–ఆరినేటర్ శివకుమార్, నరేష్, డీఈవో ఖాదీ గ్రామోద్యోగ్ మహా విద్యాలయ్, సేవా సమితి కో–ఆర్డినేటర్ దేవరెడ్డి, ఫ్యాకల్టీ సభ్యులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల్లో వాటా చెల్లించాలి

- ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి టి.శ్రీనివాస్


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

గోదావరిఖని: సంస్థ అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కూడా లాభాల్లో వాటా చెల్లించాలని ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి టి.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం యూనియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. సింగరేణిలో సుమారు 30 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు విధులు నిర్వహిస్తున్నారని, వారికి మెరుగైన వేతనాలు లేవని పేర్కొన్నారు. సంస్థ వందల కోట్లు లాభాలు గడిస్తే కాంట్రాక్టు కార్మికులను విస్మరించడం అన్యాయమన్నారు. కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని సీఎం హామీ ఇచ్చినా అమలు చేయలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు బ్రహ్మానందం, వెంకన్న, బి.అశోక్, నరేశ్, నేరెళ్ల రాజేందర్, రాజు, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు సాధించాలి


జీఎంలను సన్మానిస్తున్న ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు, అధికారులు

రామగిరి: బొగ్గు ఉత్పత్తి లక్ష్యసాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని మార్కెటింగ్, ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ జీఎంలు దేవేందర్, సాయిబాబు అన్నారు. ఆర్జీ–3 పరిధి ఏపీఏ, ఓసీపీ–1, 2 గనుల్లో బుధవారం పర్యటించారు. జీఎం కార్యాలయంలో సమీక్షించారు. గనిలో పనులు, తీసుకోవాల్సిన చర్యలు, యంత్రాల వినియోగం, రక్షణ చర్యలపై చర్చించారు. ఏరియా ఇంజినీర్ సీతారామం, ప్రాజెక్టు అధికారి కె.నాగేశ్వర్‌రావు, ప్రాజెక్టు ఇంజినీర్ టి.రఘురాం, సుధాకర్, నాణ్యత అధికారి బి.వి. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

హైపవర్‌కమిటీ వేతనాలు చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న విశ్వనాథ్

గోదావరిఖని: సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు కె.విశ్వనాథ్ అన్నారు. బుధవారం ఆర్జీ–1 ఏరియాలో మాట్లాడారు. సింగరేణి సంస్థలో 40 వేల మంది పర్మినెంట్ ఉద్యోగులు, 30వేలమంది కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని పేర్కొన్నారు. హైపవర్ కమిటీ వేతనాలు అమలు చేసి 2013 నుంచి ఏరియర్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈనెల 20వరకు దశలవారీ ఆందోళన కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు రాజేందర్, ఐలయ్య, వెంకన్న, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఓసీపీ-1ను సందర్శించిన ప్లానింగ్ జీఎం



గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–3 పరిధిలోని ఓసీపీ–1ను కార్పొరేట్ ప్రాజెక్టు అండ్ ప్లానింగ్ జీఎం సాయిబాబు బుధవారం సందర్శించారు. ప్రాజెక్టు ఎక్స్‌టెన్షన్ కోసం ప్రతిపాదనలు, సర్వే ఏరియాను మ్యాప్ ద్వారా పరిశీలించారు. ఆయన వెంట ప్రాజెక్టు అధికారి రాధాకృష్ణ, డీజీఎంలు ఎస్‌కే.మదార్, వెంకటేశ్వరరావు, మురళీధర్ రాజు, పీఈ శ్రీనివాస్, మేనేజర్ ఉదయ్‌హరిజన్, ఏరియా సర్వే ఆఫీసర్ జైనుల్లాబద్దిన్, తదితరులున్నారు.